7

సాక్షి జగిత్యాల

సోమవారం । 27 । మార్చి । 2023



గోదారమ్మకు మొక్కులు

ధర్మపురి : గోదావరి నదిలో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.



పోచమ్మ బోనాలు

రాయికల్ : వీరాపూర్ గౌడసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్ మాసం

– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6.33	మంగళ 4.48

న్యూస్‌రీల్

సబ్ కోర్టు జడ్జిగా ప్రసాద్



జగిత్యాలజోన్: ఇటీవల ప్రారంభమైన మెట్‌పల్లి సబ్ కోర్టు జడ్జిగా కంచ ప్రసాద్ నియమితులయ్యారు. జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రసాద్‌కు మెట్‌పల్లి సబ్ కోర్టు జడ్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మెట్‌పల్లి సబ్‌కోర్టుకు పూర్తిస్థాయి జడ్జిని నియమించే వరకూ ప్రసాద్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తారని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

ఘనంగా సాయిసంకీర్తన



అఖండ సాయినామ సంకీర్తనలో కలశాలు

జగిత్యాలటౌన్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్థానిక శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం మూడోరోజు అఖండ సాయినామ సంకీర్తన ఘనంగా నిర్వహించారు. 1,008 కలశాలను గంగాజలంతో నింపి పూజలు చేశారు. ఈనెల 31వ తేదీ వరకు సాయినామ సంకీర్తన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. వేద పండితుడు తిగుళ్ల విషుశర్మ పర్యవేక్షణలో అఖండ సాయినామ సంకీర్తన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు కిషన్‌గౌడ్, రాంకిషన్‌రావు, కిషన్, రాంచంద్రం, గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా నాగులమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల క్యూ

కోరుట్లరూరల్: నాగులపేట నాగులమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. కోరుట్లతోపాటు పరిసర మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి నాగులమ్మను దర్శించుకున్నారు. తమ కుటుంబాలను సల్లంగా సూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆర్డీవో వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీమణి సరోజన, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ఏఎంసీ మాజీచైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం



దాత అజయ్‌ను సన్మానిస్తున్న అర్చకులు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్‌లోని సుమారు 500ఏళ్లక్రితం నాటి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామస్తుడు ఓగుల అజయ్ రూ.30 లక్షలు విరాళంగా అందజేశారు. దీంతో జీర్ణోద్ధరణ పనులను ఆదివారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్చకులు.. ప్రధాన ఆలయంలోని స్వామివారి ఉత్సవ విగ్రహాలన్ని మరోచోట ప్రతిష్ఠాపన చేశారు. మూడు రోజులపాటు చేపట్టే పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం దాత అజయ్‌ను సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఉపసర్పంచ్ పూదూరి రమేశ్, కో ఆప్షన్ సభ్యుడు ఎం.బీబా, మాజీ జెడ్పీటీసీ శంకర్, గ్రామస్తులు అభినందించారు.

రేపటినుంచి శాస్త్రవేత్తల సమావేశాలు

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళ, బుధవారాల్లో ఉత్తర తెలంగాణ జోనల్‌స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు నిర్వహిస్తామని పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రస్తుత యాసంగిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాబోయే వానాకాలంలో సాగుచేసే పంటల గురించి శాస్త్రవేత్తలు చర్చించనున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని వ్యవసాయ పరిశోధన స్థానాల శాస్త్రవేత్తలు హాజరవుతారని ఆయన వివరించారు.

రోడ్లను ఆక్రమిస్తున్నారు..



వాహనాలు నిలుపకుండా రహదారి పక్కనే ఏర్పాటు చేసిన బోర్డులు

- రహదారులపైనే బోర్డులు
- ప్రమాదకరంగా ఫ్లెక్సీలు
- ఇరుకైన రోడ్లతో తిప్పలు
- తరచూ ప్రమాదాలు
- వివాదాస్పదంగా వ్యాపారుల తీరు

జగిత్యాల: జిల్లా కేంద్రం జగిత్యాల పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆస్పత్రులు, సూపర్‌మార్కెట్లు, కిరాణాలు, స్కానింగ్ సెంటర్లు, వాణిజ్య సంస్థలు అత్యధికంగా వెలుస్తున్నాయి. ముఖ్యంగా కొత్తబస్టాండ్ – టవర్‌సర్కిల్ వరకు, తహసీల్ చౌరస్తా – జంబిగద్దె వరకు, జంబిగద్దె – అశోక్‌నగర్ వరకు, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వాణిజ్య, వ్యాపార సముదాయాలు విరివిగా ఉన్నాయి. ఇదేసమయంలో కొందరు తమ దుకాణాల ఎదుట బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు ఏకంగా రోడ్డును ఆక్రమించి ఫ్లెక్సీలు కట్టడం ప్రమాదకరంగా మారుతోంది. ఇంకొందరు ఏకంగా రోడ్డుపై గుంతలు తవ్వి, పెద్దఇనుప రాడ్లు పాతి, వాటికి ఫ్లెక్సీలు పెడుతున్నారు. దీంతో రహదారి ఆక్రమణకు గురై వాహనాల రాకపోకలకు సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు నడిచేందుకు కూడా స్థలం లేకుండాపోతోంది. కొందరు రేడియం స్టిక్కర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు



యావర్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చేయడంతో రాత్రిపూట వాహనాల వెలుతురుకు రిఫ్లెక్షన్ అవుతున్నాయి. ఫలితంగా ఎదుటివారు, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ జరుగుతున్నాయి.

పత్తాలేని టౌన్‌ప్లానింగ్ అధికారులు..

- కొందరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.
- ఎక్కడైనా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేస్తున్న అధికారులు.. రహదారులను ఆక్రమించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- వారి నిర్లక్ష్యంతోనే మున్సిపాలిటీ పరిధిలో అనేకచోట్ల బోర్డులు, ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారని విమర్శలున్నాయి.
- ఇవి ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయనే ఆందోళన ఉంది.
- రోడ్డును ఆక్రమించి సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పార్కింగ్‌కు స్థలం లేకుండాపోతోంది.

అసలే ఇరుకైన రోడ్లు..

జిల్లా కేంద్రంలో అసలే ఇరుకైన రోడ్లు ఉన్నాయి. వాటిని ఆక్రమించి బోర్డులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా ఆస్పత్రులు, ఇతర పనుల కోసం వచ్చే వాహనదారులకు పార్కింగ్ స్థలం లేకుండాపోతోంది. కార్లు, జీపులు, ఆటోలు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ పరిధిలోని రోడ్లను ఆనుకుని సైన్ బోర్డులు ఏర్పాటు చేయొద్దు. ఇలాచేస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. పార్కింగ్‌కు సైతం ఇబ్బందిగా ఉంటుంది. ఇలాంటి వారికి నోటీసులు జారీచేస్తాం. ప్రతీ వ్యాపారి తన పరిధిలోనే సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలి. రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

– శ్యామ్, టీపీఎస్, జగిత్యాల

దర్జాగా కబ్జా

- కొన్నిరోజులు రోడ్లపై సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు పెడుతున్న కొందరు వ్యాపారులు.. ఆ తర్వాత తమ దుకాణం ఎదుట రోడ్డును ఆక్రమిస్తున్నారు.
- మరికొందరు ఏకంగా రేకులషెడ్లు నిర్మిస్తున్నారు.
- టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న దుకాణ యజమానులు.. షెటర్లు, భవనాల ఎదుట దర్జాగా రేకుల షెడ్లు నిర్మించి వ్యాపారాలు నడుపుతున్నారు.

హనుమా.. గోడు వినుమా!



అసంపూర్తిగా మిగిలిన మెట్లదారిలో నడవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధ భక్తులు

- పునాదులు దాటని మాల విరమణ మండపం
- నిధులు విడుదలైనా ప్రారంభంకాని మెట్లదారి
- సమీపిస్తున్న హనుమాన్ చినజయంతి
- అస్తవ్యస్తంగా కొండగట్టు ఆలయ ప్రాంగణం

కొండగట్టు(చొప్పదండి): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో వచ్చే ఏప్రిల్ 6న హనుమాన్ చినజయంతి వేడుకలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు, దీక్షాపరులు తరలివస్తారు. అయితే, గడువు సమీపిస్తున్నా ఆలయ అధికారులు ఇప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు ప్రారంభించడంలేదు. ప్రధానంగా మాలవిరమణ చేసే మండపం, మెట్లదారి పునాదులు దాటడం లేదు. ఫలితంగా ఏళ్లుగా మాలధారులు, దీక్షస్వాములు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉత్సవాలకు లక్షల మంది దీక్షాస్వాములు

- ఉత్తర, దక్షిణ తెలంగాణకు చెందిన లక్షల మంది హనుమాన్ దీక్షా స్వాములు మాల విరమణ చేయడానికి కొండగట్టుకు తరలి వస్తారు.
- ఏటా అసౌకర్యాల మధ్యే వారు మాల విరమణ చేసుకుంటున్నారు.
- ఈసారైనా మాల విరమణకు మండపం అందుబాటులోకి వస్తుందని ఆశించినా ఇంకా ఆ పనులే ప్రారంభం కాలేదు.

రూ.2.5కోట్లతో పనులు..

- 11, 21, 41 రోజుల పాటు దీక్ష చేపట్టిన స్వాములు.. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి తరలివచ్చి మాల విరమణ చేస్తారు. వీరికోసం రూ.2.50కోట్ల వ్యయంతో ఓ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. కారణం



పునాదుల్లోనే నిలిచిన మాలవిరమణ మండపం

తెలియదు కానీ, మధ్యలోనే పనులు ఆపేడంతో అధికారుల చొరవతో ఇటీవల మళ్లీ ప్రారంభించారు. కొద్దిరోజులకే అవి మళ్లీ ఆగిపోయాయి. ఫలితంగా కల్యాణ కట్టలో మాలవిరమణ చేస్తూ భక్తులు ఇబ్బందుల పాలవుతున్నారు.

ప్రారంభంకాని మెట్లదారి పనులు..

- కాలినడక మొక్కుతో కొండపైకి వచ్చే భక్తుల కోసం గుట్ట దిగువనుంచి ఘాట్‌రోడ్డు టటటటసమీపంలో సుమారు 1.5 కిలో మీటర్ల దూరం వరకు మెట్లదారి ఉంటుంది. దాని పునరుద్ధరణకు రూ.2.5కోట్లతో టెండర్ పూర్తిచేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంకా నిర్మాణం ప్రారంభించలేదు.

బాధగా ఉంది



ఈసారి 21రోజుల మాల ధారణ చేశా. మాల విరమణ కోసం కొండపై మండపం నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగడిచినా కార్యరూపం దాల్చడంలేదు. అధికారుల తీరు బాధగా ఉంది.

–వెంకట్, హన్మాన్ దీక్షాపరుడు, హైదరాబాద్

వసతులు లేవు



కట్నాలు, కానుకల రూపంలో భక్తులు స్వామివారికి భారీగా సమర్పిస్తున్నారు. ఆ సొమ్మును అధికారులు, ప్రభుత్వం భక్తుల సౌకర్యం కోసం ఎందుకు వినియోగించడం లేదు. కనీస సౌకర్యాలు లేకుంటే ఎలా?

– రాపర్తి రవికుమార్, వీహెచ్‌పీ నేత

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మాల విరమణ మండపం పనులు కొనసాగుతున్నాయి. మెట్లదారి నిర్మాణం త్వరలోనే ప్రారంభించి పూర్తిచేస్తాం. హనుమాన్ చినజయంతికి హాజరయ్యే దీక్షస్వాములకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.

– వెంకటేశ్, ఈవో, కొండగట్టు

పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధి

- రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



అవార్డు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలటౌన్: సీఎం కేసీఆర్ ప్రారంభించిన పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారాయని రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీవోసీ)లో ఆదివారం నిర్వహించిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా 9 కేటగిరీల్లో తొలిమూడు స్థానాల్లో నిలిచిన 27 గ్రామపంచాయతీలకు ఆయన అవార్డులు, ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పల్లెప్రగతి ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ మెరుగుపడిందని తెలిపారు. మొక్కల పెంపకంతో పచ్చదనం పర్చుకుందని అన్నారు. తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించడంతో గ్రామాల రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. సర్పంచులు, అధికారుల సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో 20 ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపికచేస్తే.. అందులో 19 పంచాయతీలు తెలంగాణ రాష్ట్రానికి చెందినవి కావడం గర్వకారణమన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వంద శాతం ఓడీఎఫ్ ప్లస్ సాధించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రమేశ్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

‘మీ వెంటే నేను..’



మాట్లాడుతున్న కె.విద్యాసాగర్‌రావు

మల్లాపూర్ : ఎమ్మెల్యేగా ఉన్నా, లేకున్నా నా ప్రాణం ఉన్నంత వరకూ మీ వెంటే ఉంటానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక కేఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్మన్ దావ వసంతతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌ను ఓడించే శక్తి కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. ఆ పార్టీల కుట్రలను ఎండగడుతూ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటికే 90శాతం అభివృద్ధి పనులను పూర్తిచేశానని, మిగతా పనులకు నిధుల కొరత అడ్డంకిగా మారి ఆలస్యమవుతోందని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి తన కుమారుడు డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ చేతుల్లో పెడుతున్నానని, తనపై ఉన్న ప్రేమాభిమానాలనే సంజయ్‌పై ఉంచి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే, ఖాదీబోర్డు చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు.. ఇలాంటి ఏ పదవి చేపట్టినా ప్రజలు, కార్యకర్తల సేవకే వినియోగిస్తానని అన్నారు. నాయకులు సంజయ్‌కుమార్, కాటిపెల్లి సరోజన, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గౌరు నాగేశ్, కొమ్ముల జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించండి

సారంగాపూర్(జగిత్యాల): వర్షాకాలంలో బీర్‌పూర్ మండలం రోళ్లవాగు ప్రాజెక్టు కట్టతెగి రైతులు పంటలు కోల్పోయారని, దానిదిగువన ఉన్న అరగుండాల ప్రాజెక్టు, గోదావరి నదీతీరంలోని ఎత్తిపోతలు వరదలకు కొట్టుకుపోయి వేలాది ఎకరాలు సాగుకు పనికిరాకుండాపోయాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. వీటికింద పంటలు కోల్పోయిన రైతులకు రెండు పంటలకు కలిపి రూ.40వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఇదేవిషయంపై ఇప్పటికే పలుమార్లు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని, ఇప్పుడు మరోసారి లేఖ రాస్తున్నానని వెల్లడించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలు, వడగళ్లతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషకరమన్నారు. బీర్‌పూర్ మండలం రోళ్లవాగు, అరగుండాల ప్రాజెక్టు ఆయకట్టుకింద రెండు పంటలు నష్టపోయిన రైతులు, మత్స్యకారులను ఆదుకోవాలని సీఎంకు లేఖ రాస్తున్నానని వెల్లడించారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

రైతు ప్రాణాలు తీసిన అప్పులు

మల్లాపూర్(కోరుట్ల): కూతుళ్ల వివాహం కోసం చేసిన అప్పులు తీర్చలేననే బాధ రైతు పొరండ్ల రాజన్న (59) ప్రాణాలు తీసింది. మొగిలిపేట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పొరండ్ల రాజన్న – గంగవ్వ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరి వివాహాల కోసం రాజన్న తనకు తెలిసినవారి వద్ద రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయంలోనూ ఆశించిన దిగుబడిరాక పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేశాడు. వీటిని తీర్చేందుకు తనకున్న వ్యవసాయ భూమి విక్రయించాడు. అయినా అప్పు పూర్తిగా తీరలేదు. అయితే, పదిగంటల వ్యవసాయ భూమి మిగిలిఉండగా అందులోనే వివిధ పంటలు పండిస్తున్నాడు. ఇందులో వచ్చే సొమ్ముతో అప్పు తీర్చే దారికనిపించలేదు. కొద్దిరోజులుగా తీవ్రంగా మదనపడుతున్నాడు. ఈక్రమంలో శనివారం తన పొలం వద్దకు వెళ్లాడు. మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. సమీప రైతులు గమనించి రాజన్నను ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బందితో ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

37 గోదాములు.. 82వేల మెట్రిక్ టన్నులు

- పెరుగుతున్న నిల్వ సామర్థ్యం
- పంట ఉత్పత్తుల రక్షణకు భరోసా

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గతంలో ఓవైపు ధాన్యం నిల్వల సామర్థ్యం, మరోవైపు రసాయన ఎరువుల నిల్వల సామర్థ్యం ఆశించిన మేరకు లేదు. దీంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పటివరకు, సమీప పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలోని గోదాములకు పంట ఉత్పత్తులు, ఎరువులు తరలించి అక్కడ నిల్వచేసేవారు. అవసరమైనప్పుడు ఇక్కడకు తీసుకొచ్చేవారు. తద్వారా రవాణా భారం తడిసి మోపెడయ్యేది. ప్రస్తుతం మనజిల్లాలోనే నిల్వ సామర్థ్యం పెంచేందుకు అవసరమైన గోదాములు నిర్మిస్తోంది. ఇక ఇక్కడే రేషన్ బియ్యం, ఎరువులు, పంట ఉత్పత్తులు నిల్వచేస్తున్నారు. దీనికితోడు, జిల్లాకు రైల్వేలైన్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో అవసరమైనప్పుడల్లా తమిళనాడు తదితర రాష్ట్రాలకు బియ్యంతోపాటు ఇతర నిల్వ లూ పంపిస్తున్నారు.

జిల్లాలో 37 గోదాంలు..

- జిల్లాలో 37 గోదాములు ఉండగా, వాటి నిల్వ సామర్థ్యం 82,050 మెట్రిక్ టన్నులకు చేరింది.
- మార్కెట్ కమిటీ నిధులతోపాటు నాబార్డు నిధులు వెచ్చించి వీటిని నిర్మించారు.
- జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా 12 మండలాల్లో గోదాములు నిర్మించారు.
- కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో నిర్మించాలనే డిమాండ్ రైతుల నుంచి వస్తోంది.



జగిత్యాల మార్కెట్‌లో నిర్మించిన గోదాము

అద్దెతో అదనపు ఆదాయం..

మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్మించిన గోదాములను అద్దెకు ఇస్తున్నారు. ప్రధానంగా సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ అధికారులు వీటిని అద్దెకు తీసుకుంటున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లుల్లో మర ఆడించి, ఆ తర్వాత వచ్చిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు మార్కెటింగ్ గోదాములను అద్దెకు తీసుకుని అందులో నిల్వ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చే యూరియా, డీఏపీ వంటి ఎరువులను నిల్వ చేసేందుకు మార్క్‌ఫెడ్ కూడా గోడౌన్లను లీజుకు తీసుకుంటోంది. వీరికితోడు రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులు.. ఆశించిన మేరకు ధర లభించకుంటే.. నిల్వ చేసేందుకు మార్కెట్ గోదాములను లీజుకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 73,800 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న 26 గోదాములను ప్రభుత్వ రంగ సంస్థలైన సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ అద్దెకు తీసుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దెకు తీసుకున్న సంస్థలు.. ఆయా మార్కెట్‌ల పరిధిలోని గోదాములకు ఏడాది ప్రాతిపదికన అద్దె చెల్లిస్తుంటాయి. అయితే, పౌర సరఫరాల వంటి సంస్థలు అద్దె చెల్లించడంలో కొంత ఆలస్యం చేస్తున్నాయి. బకాయిల వసూళ్లకు మార్కెట్ అధికారులు అనేక లేఖల రాయాల్సి వస్తోంది.

అప్పు తెచ్చి నిర్మించడంతో..

- చాలాచోట్ల మార్కెటింగ్ శాఖ నిర్మించిన గోదాములను రైతులు తమ పంట ఉత్పత్తుల నిల్వల కోసం ఉపయోగించుకోవడం లేదు.
- మార్కెట్లో మద్దతు ధర లభించనప్పుడు రైతులు గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసే పరిస్థితి ఉన్నా.. రక్షణ ఉండదనే ఉద్దేశంతో వాటిని వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు.
- దీంతో కొన్నిసార్లు నెలల తరబడి గోదాములు ఖాళీగా ఉంటున్నాయి.
- దీనికితోడు, జగిత్యాల వంటి చాలాచోట్ల గోదాములను ఇతర మార్కెట్‌ల నుంచి అప్పులు తెచ్చి మరీ నిర్మించారు.
- దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతోంది.
- గోదాంలు నిర్మించింది ప్రభుత్వ సంస్థ కావడంతో.. అద్దె చెల్లించడంలో మిగతా ప్రభుత్వ సంస్థలు జాప్యం చేస్తున్నాయి.

అద్దెకు ఇస్తున్నాం



జిల్లాలోని అన్ని గోదాములను ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థలకు అద్దెకు ఇస్తున్నాం. ప్రస్తుతం 8,250 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల 11 గోదాములు ఖాళీగా ఉన్నాయి. కథలాపూర్, మేడిపల్లిలో గోదాములు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

గోదాములు, నిల్వ సామర్థ్యం(మెట్రిక్ టన్నుల్లో)

ప్రాంతం	గోదాముల సంఖ్య	నిల్వ సామర్థ్యం
జగిత్యాల	6	17,000
మెట్‌పల్లి	7	15,350
ధర్మపురి	6	14,500
మల్యాల	4	3,750
మల్లాపూర్	1	5,000
ఇబ్రహీంపట్నం	2	3,100
పెదపల్లి	1	2,500
వెల్గటూర్	1	5,000
రాయికల్	1	2,500
కోరుట్ల	4	2,100
గొల్లపల్లి	4	3,000

క్లుప్తంగా

హుజూరాబాద్‌వాసికి జీవన సాఫల్య పురస్కారం


పురస్కారం అందుకుంటున్న వీరయ్య

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన సీనియర్ రంగస్థలనటుడు లింగాపురం చంటి వీరయ్య హైదరాబాద్ లోని విశ్వశ్రీ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉగాది జాతీయం పురస్కారాల సందర్భంగా సంస్థ అధ్యక్షుడు వల్లకొండ గురుమూర్తి జీవన సాఫల్య పురస్కారాన్ని వీరయ్యకు అందించారు. వీరయ్యకు అవార్డు రావడంపై స్థానిక కళాకారులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

మహిళను చేరదీసిన సఖీ నిర్వాహకులు


మహిళను చేరదీసిన సఖీ బృందం

జగిత్యాలక్రైం: రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని ఆయిల్‌మిల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఓ మహిళ సాయంత్రం వరకు రోడ్డుపక్కన నిలబడి ఉంది. దీంతో స్థానికులు అంగన్‌వాడీ టీచర్ ఉమకు ఫోన్‌చేసి, సమాచారం అందించడంతో మహిళా హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించింది. దీంతో జగిత్యాల సఖీబృందం అక్కడికి వెళ్లి సుమారు 25ఏళ్ల మహిళను చేరదీశారు. ఆమె నుంచి వివరాలు సేకరించగా, తనకు తాత్కాలికంగా వసతి కల్పించాలని కోరడంతో మహిళను జగిత్యాల సఖీ కేంద్రంలో వసతి కల్పించారు.

రహదారి పనులు ప్రారంభించాలి


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మరిమడ్ల–మానాల రహదారి పనులను ప్రారంభించాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరిమడ్ల నుంచి మానాల వరకు 8.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు రూ.17.5 కోట్లు మంజూరయ్యాయని అన్నారు నిధులు వచ్చి నెలలు గడుస్తున్నా పనులు జరగడం లేదన్నారు. రహదారి లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని వాపోయారు. అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని కోరారు. గ్రామస్తులు కుమ్మరి దిలీప్‌కుమార్, తిక్కల రాజు, జింక రమేశ్, పుల్కం మల్లేశం, వార్డు సభ్యులు మందరెడ్డి, ఆకుల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

నాటక అధ్యాయం ముగిసిపోలే..

- ప్రజా చైతన్యానికి నాటకాలు దోహదం
- నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం

విద్యానగర్(కరీంనగర్): ప్రపంచమే ఒక రంగస్థల వేదిక ప్రతీ మనిషిదీ విలక్షణమైన పాత్ర అంటాడు షేక్స్ పియర్. అనాదిగా ప్రజలకు వినోద సాధనాలుగా నిలిచిన ఎన్నో కళారూపాలు నిజానికి మన జీవన సంస్కృతి కి అచ్చమైన ప్రతీకలు సమకాలీన సమాజంలోని రుగ్మతలు అసమానతలు, సాంఘిక, దురాచారాలు, సన్నిహితమైన మానవ సంబంధాలు నేపథ్యంలో నాటకాలు గతంలో ఓ వెలుగు వెలిగాయి. జనంతో జేజేలు పలికించుకున్న కళాకారులు ఎందరో ఉన్నారు. కాలంతో పాటు వచ్చిన మార్పులు ఆధునిక జీవన విధానం , ప్రజల దృక్పథాన్ని సమూలంగా మార్చాయి. శాటిలైట్ చానళ్ల ధాటికి నాటకాలు సామాన్యులకు దూరమయ్యాయి. అయినా సాంఘీక దురాచారాలు, అంధవిశ్వాసాలపై ప్రజా చైతన్యానికి ప్రజా సమూహంలోని సమస్యలపై అవగాహన కల్పించేందుకు నాటకాలు ఇతోధికంగా దోహదం చేస్తూనే ఉన్నాయి. జిల్లాలో ఈ రంగంపై తరగ నిమక్కువతో నాటక ప్రదర్శనలు ఇస్తున్న సాంస్కృతిక సంస్థలు కళాకారులు నేటికి కనిపించడం నాటకరంగంపై ప్రజలకున్న ఆసక్తికి నిదర్శనంగా నిలుస్తోంది.


చెల్లని పైసలు నాటకంలో సన్నివేశాలు

వందేళ్ల చరిత్ర

కళారూపాలకు కీర్తిగాంచిన జిల్లాలో నాటకరంగానికి వందేళ్ల చరిత్ర ఉంది. 20వ శతాబ్దం తొలిదశకంలో నాటక సమాజాలు ఆవిర్భవించాయి. పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో శ్రీలక్ష్మీనరసింహ నాట్యమండలి ఏర్పడి 1938 జూన్ 12న సతీసావిత్రి నాటకం ప్రదర్శించారు. 30 ఏళ్ల పాటు ఎన్నో నాటకాలు ప్రదర్శించి జన హృదయాలను ఆకట్టుకున్నారు. అలా ఈ రంగంపై ఎంతోమంది ఆసక్తి పెంచుకుని కళాకారులుగా ఎదిగి నాటక సమాజాలు ఏర్పాటుచేసి ఎన్నో నాటకాలు ప్రదర్శించారు పద్మ కళానికేతన్ పేరులో కొక్కుల భాస్కర్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో నాటక ప్రదర్శనాలు ఇచ్చారు. జిల్లాకు చెందిన శ్రీరాముల సత్యనారాయణ స్థాపించిన చైతన్య కళాభారతి సంస్థ 150కి పైగా ప్రదర్శనలిచ్చింది. ఇప్పటికీ ఈ సంస్థ ఆధ్వర్యంలో నాటకప్రదర్శనలు కొనసాగుతూనే ఉన్నాయి. శ్రీ వెంకటేశ్వర, శారద, నటరాజ కళానికేతన్, నవోదయ కల్చరల్ అసోసియేషన్, వెంకటేశ్వర కళాసమితి, ఊర్వశి, కళా స్రవంతి, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వంటి సంస్థలు నాటకరంగం అభివృద్ధికి ఎన్నోసేవలు చేశాయి.

జిల్లాలో నాటక రచయితలు

జిల్లాలో నాటక రచనా రంగంలో ప్రతిభావంతులకు కొదవలేదు. చైతన్య కళాభారతి వ్యవస్థాపకుడు శ్రీరాముల సత్యనారాయణ 10కి పైగా నాటకాలను రచించి ఈ రంగంలో తన ప్రతిభ నిరూపించుకున్నారు. పామరులు, ఈ తరంమారాలి, ఆకలివేట, ఆడది, మనిషి, నిరసన, కాలచక్రం, ప్రేమ పిచ్చోళ్లు, చదవరా, ఆశాపాశం, అగ్ని పరీక్ష నాటకాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. రచయిత బండారి దేవరాజ్ రచించిన ప్రేమగోల, బడి పంతులు, సంసారంలో సరాగాలు, బంగారు గుడ్లు, భద్రం కొడుకో ఎవరో ఒకరు, క్లిక్, లాల–లీల, ప్రేమ ఈజీక్వల్ టు, చెల్లని పైసలు తదితర నాటకాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. జగిత్యాలకు చెందిన కేవీ.నరేందర్ రాసిన గర్భగుడి, క్షతగాత్రుడు, కల్లోలం, పడమటి పొద్దు నాటకాలు ప్రజలను రంజింపచేశాయి. గర్భగుడి నాటకం నంది నాటకోత్సవాల్లో ప్రశంసా పత్రం పొందింది.

వొ ద్నాల కిషన్ రచించిన విధాత, నాకు ఇల్లొచ్చింది, గజేంద్ర మోక్షం, ప్రతిజ్ఞ నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. కూనమల్ల రమేశ్ టర్నింగ్ పాయింట్, కాలుష్యం అనే రెండు నాటకాలు రాసి, దర్శకత్వం వహించగా, హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇచ్చిన ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.

'చెల్లని పైసలు' నాటకానికి తామ్ర నంది

బండారి దేవరాజ్ రచించిన చెల్లనిపైసలు నాటకానికి మంచాల రమేశ్ స్వీయ దర్శకత్వంలో రాష్ట్రస్థాయిలో మ ంచి ఆదరణ లభించింది. నాటకం ప్రదర్శించిన ప్రతి చోట ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రాష్ట్ర నంది నాట కోత్సవాల్లో తామ్ర నందిని గెల్చుకుని జిల్లాకు గర్వకారణమైంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక పరిషత్ పోటీల్లో రక్తికట్టించింది. ప్రదర్శించిన ప్రతిచోటా పలువిభాగాల్లో అవార్డులు దక్కించుకుంది.

'దొంగలు' నాటకానికి..

చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శిస్తున్న దొంగలు నాటిక ప్రతీచోట ఉత్తమ నాటిక బహుమతి పలు విభాగాల్లో అవార్డులు, బహుమతులు అందుకుంది.

కళాకారులకు ఆదరణ లేదు



ఆ రోజుల్లో కళాకారుల్లో నిబద్ధత, చిత్తశుద్ధి ఉండేది. కళారూపాలపై అనురాగంతో పనిచేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు. నిజమైన కళాకారులను ప్రభుత్వం గుర్తించడం లేదు. తెలంగాణ మాండలికాన్ని ఆ రోజుల్లోనే నాటకాల్లోని పాత్రల్లో ప్రవేశపెట్టి జనానికి చేరువయ్యాం. ప్రస్తుత కాలంలో నాటకానిది ముగిసిపోతున్న అధ్యాయం.

– జి కృపాదానం, జిల్లా ఫోక్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు

సింగరేణి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సింగరేణి అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలో ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనికి సంబంధించిన ప్రజా అభిప్రాయ సేకరణలో పలువురి అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యూమారేడుపాకలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి వకీల్ పల్లి గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సూపర్ స్పెషాల్టీ వైద్యుల బృందం ఆధ్వర్యంలో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, ఏసీఎంవో ఏరియా ఆస్పత్రి ఆర్జీ–2 రీజియన్ డాక్టర్ ఆర్. కిరణ్‌రాజ్, డివిజన్ కార్పొరేటర్ తాళ్ల అమృత, ఎస్‌వోటు జీఎం అబ్దుల్ సలీం, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం సివిల్ ధనుంజయ్, ఎస్టేట్స్ అధికారి సురేశ్‌బాబు, వైద్యసిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కథలాపూర్/కోరుట్లరూరల్: కథలాపూర్ మండలంలోని సిరికొండ శివారులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో కోరుట్ల మండలం నాగులపేటకు చెందిన బలుసు రమేశ్(43) వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రమేశ్ తన తల్లి గంగుతో కలిసి బైక్‌పై నాగులపేట నుంచి కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామానికి వెళ్తున్నారు. ఈక్రమంలో సిరికొండ శివారులో రమేశ్ బైక్‌ను బొలేరో వాహనం ఢీకొట్టడంతో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గంగుకు స్వల్పగాయాలు కాగా స్థానికులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. రమేశ్ నెల క్రితం గల్ఫ్ నుంచి వచ్చాడు. మరో 15 రోజుల్లో గల్ఫ్‌వెళ్లాల్సి ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మానస, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మానస ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.


బలుసు రమేశ్ (ఫైల్)

తండ్రిని కాపాడబోయి తనయుడు మృతి

కరీంనగర్‌క్రైం: మంటల్లో కాలిపోతున్న తండ్రిని కాపాడబోయిన తనయుడు అవే మంటలు అంటుకొని చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న కశ్మీర్ గడ్డకు చెందిన అన్నమనేని మాధవరావు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోగా, కాపాడబోయిన అతని తనయుడు వెంకటేశ్వరరావుకు మంటలు అంటుకున్నాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన బాలిక

- బయటకు తీసిన గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు బాలిక బావిలో పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌కు చెందిన నగునూరి పద్మ శంకర్‌ల కూతురు అంకిత గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బావివద్దకు చేరుకొని మంచానికి తాళ్లుకట్టి బావిలో నుంచి బయటకు తీశారు. తీవ్రగాయాలైన అంకితను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సఅందిస్తున్నారు. ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.


బావిలో నుంచి బయటకు తీస్తున్న గ్రామస్తులు

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం ప్రదానం

సిరిసిల్లకల్చరల్: సాహిత్యాన్ని పోషించడం ద్వారా సమాజం ఉద్ధరించబడుతోందని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, కేంద్ర సాహిత్య అకాడమీ సమన్వయ కర్త ఆచార్య ఎన్.గోపి అన్నారు. ఆదివారం రగుడు లోని రంగినేని సుజాత ఎడ్యుకేషన్ ట్రస్టులో రంగినేని ఎల్లమ్మ స్మారక సాహిత్య పురస్కార ప్రధానోత్సవానికి హాజరై మాట్లాడారు. రంగినేని ట్రస్టు స్ఫూర్తితో ఉమ్మడి కరీంనగర్ నుంచి 50కి పైగా నానీల పుస్తకాలు వెలువడ్డాయన్నారు. రాష్ట్ర స్థాయిలో కవితా రచనలు నిర్వహించడం ట్రస్టు నిర్వాహకుడు రంగినేని మోహన్‌రావు సాహిత్య అభిమానానికి నిదర్శనమన్నారు. మరో తరానికి సైతం సాహిత్యం అందించి ఆదర్శంగా నిలుస్తున్న ట్రస్టును పుణ్యభూమితో పోల్చారు. విశిష్ట అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై మాట్లాడుతూ.. 18 ఏండ్లుగా కవులు, రచయితలకు అవార్డులిచ్చి ప్రోత్సహిస్తున్న రంగినేని ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. విస్తృతస్థాయి అధ్యయనంతో సాహిత్యం మ రింత వికసిస్తుందని, వైవిధ్యమైన రచనలు వెలుగు చూస్తాయన్నారు. వస్తు వైవిధ్యం, జీవద్భాషలో వ్యక్తీకరించడంతో ఉడుకు బెల్లం కథలకు ప్రాణం పోశాయన్నారు. రక్తసంబంధాలు బలహీనమవుతున్న తరుణంలో వాటిని పునరుద్ధరించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ కథలు గుర్తు చేస్తాయన్నారు. అనంతరం పురస్కారం అందుకున్న ఉడుకు బెల్లం కథల సంపుటి రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరా వుకు పురస్కారం అందించారు. రూ. 25వేల నగ దు, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, ఉస్మా నియా వర్సిటీ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ ఎస్. రఘు, ప్రసిద్ధ కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, ట్రస్టు నిర్వాహకుడు రంగినేని మోహన్‌రావు, పురస్కార కమిటీ సమన్వయ కర్త మద్దికుంట లక్ష్మణ్, రంగినేని నవీన్‌రావు, ఎన్‌బీటి ఉప సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ తదిత రులు మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మడుపు ముత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, కవులు ఆడెపు లక్ష్మణ్, జిందం అశోక్, జనపాల శంకరయ్య, బూర దేవానందం, మానేరు రచ యితల సంఘం, సిరిసిల్ల సాహితీసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉడుకు బెల్లం రచయిత చింతకింది శ్రీనివాసరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న సభ్యులు

నానీల ఉద్యమానికి ప్రేరణ



రెండు దశాబ్దాలుగా పురస్కారాలిస్తూ కవులు, రచయితల్ని ప్రోత్సహిస్తున్న రంగినేని ట్రస్టు ద్వారా సాహిత్యంలో నానీల ఉద్యమాన్ని ప్రారంభించింది. 500 ముద్రిత, వెయ్యికి పైగా అముద్రిత నానీల సంకలనాలే ఇందుకు సజీవ సాక్ష్యాలు. సాహిత్యాన్ని పోషిస్తున్న రంగినేని మోహన్‌రావు తరతరాలూ గుర్తుండిపోతారు. సాహిత్య పోషణతో ట్రస్టు మరింత పునీతమవుతోంది.

– ప్రొఫెసర్ ఎన్.గోపి, కేంద్ర సాహిత్య అకాడమీ సమన్వయకర్త

జీవితంలో మరపురాని అనుభూతి




రంగినేని సాహిత్య పురస్కారం అందుకోవాలనే సంకల్పంతో నాలుగు పర్యాయాలుగా ప్రయత్నించాను. చివరికి ఉడుకు బెల్లం కథా సంపుటికి అవార్డు రావడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ఆశీస్సులు, కళింగ వాసుల జీవితాల్లోని భిన్నమైన దృశ్యాలు, సాంస్కృతిక నేపథ్యమే నా కవిత్వానికి మూలవస్తువులు. జన్మస్థలం చోడవరం నుంచి సిరిసిల్ల వరకు నా ప్రయాణానికి సహకరించిన అక్షరానికి రుణపడి ఉంటాను. పితృ సమానుడైన ఎన్.గోపి సమక్షంలో ఈ అవార్డును అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను.

– డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు, పురస్కార గ్రహీత

దాచుకున్న డబ్బులు ఇవ్వరా..?

- పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ ఎప్పుడో..?
- 11 నెలలుగా పడిగాపులే
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆందోళనలు
- మార్చి 31లోపు రాకుంటే ల్యాప్సే

కరీంనగర్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న విషయం అందరికీ తెలిసిందే. జనవరి 1న రావాల్సిన వేతనాలు 10వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య విడతల వారీగా వస్తున్నాయి. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల వెతలు అన్నీఇన్నీ కావు. ఇదిలా ఉంటే సప్లమెంటరీ బిల్లుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. జీపీఎఫ్, పార్ట్‌ఫైనల్, అడ్వాన్స్‌లు, ఫైనల్ పేమెంట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీఎస్‌జీఎల్‌ఐ చెక్కులు, సరెండర్ లీవ్, సప్లమెంటరీ వేతనాలు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్, పీఆర్సీ ఏరియర్స్, రిటైర్డ్ ఉపాధ్యాయుల కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ తదితర బిల్లులు 2022 ఏప్రిల్ నుంచి నేటి వరకు మంజూరు కాకుండా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. 11 నెలలుగా బిల్లులు మంజూరు చేయకుండా పెండింగ్‌లో ఉండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.30 కోట్లకు పైగా సొమ్ము పెండింగ్‌లో ఉన్నట్లు అదేవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా జీపీఎఫ్, ఇతరత్రా చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



ట్రెజరీ కార్యాలయం

టోకెన్లు తీసుకుని పడిగాపులు....

సాధారణంగా ఉపాధ్యాయులు బిల్లులను డీడీఓలు తయారుచేసి ట్రెజరీ ఆఫీసుకు పంపిస్తారు. ఆవెంటనే బిల్లుకు సంబంధించిన టోకెన్ జనరేట్ అవుతుంది. అనంతరం కొన్నిరోజుల్లోనే ఆ బిల్లు సొమ్ము ఉద్యోగి ఖాతాలో జమకావాలి. ఏదైనా బిల్లును సరిచేయాలంటే ఆర్‌బీఐకి చెందిన ఈ కుబేర్ పోర్టల్‌కు బిల్లును అప్‌లోడ్ చేసి ఆర్థికశాఖ అధికారులు ప్రాసెస్‌చేయాలి. అప్పుడే క్లియర్ అవుతాయి. కానీ ప్రస్తుతం అలా జరక్కపోవడంతో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఐదురోజులే గడువు...

బిల్లులకు ఎప్పటికప్పుడు మోక్షం లభించకపోవడంతో అవి ల్యాప్స్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా ఏదైనా బిల్లునుచేసి పంపిస్తే అదే ఆర్థికసంవత్సరంలో క్లియర్ చేయాల్సి ఉంటుంది. కొన్ని బిల్లులు గతేడాది ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి బిల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31లోపు సరిచేయకపోతే ల్యాప్స్ అవుతాయి. దీంతో మళ్లీ వీటిని తిరిగి పంపించాల్సి ఉంటుంది. ఈ తతంగం అంతా డీడీవోలకు భారంగా పరిణమించనుంది. వీటిని ఈనెల 31లోపు సరిచేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మరో ఐదురోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. భవిష్యత్ అవసరాలకు దాచుకున్న డబ్బువారికి సకాలంలో అందడం లేదు. అత్యవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది. 11 నెలలుగా బిల్లులు మంజూరు చేయకుండా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉంచడంతో ఉపాధ్యాయులు నానాకష్టాలు పడుతున్నారు.

– నందికొండ విద్యాసాగర్,టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆరు నెలలుగా డబ్బులు రాలే...



రాష్ట్ర ప్రభుత్వ లైఫ్ ఇన్సూరెన్స్(టీఎస్‌జీఎల్ఐ) ఫైనల్ పేమెంట్ కోసం గతేడాది అక్టోబర్‌లో బిల్లు పెట్టాను. ఆరు నెలలుగా ఈ కుబేర్‌లో పెండింగ్ చూపిస్తోంది. పిల్లల ఖర్చులకోసం అందుతాయని భావించాను. ఇప్పటివరకు రాలేదు.

– మహమ్మద్ మోహినొద్దీన్, స్కూల్ అసిస్టెంట్, యుపీఎస్ భూపాలపట్నం

ప్రధాన చౌరస్తాలో యువతి హల్‌చల్

- ఆటోడ్రైవర్‌పై రాళ్లతో దాడి
- విస్తుపోయిన స్థానికులు


ఆటోడ్రైవర్‌తో వాగ్వాదానికి దిగుతున్న యువతి

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో యువతి హల్చల్ చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఆటో దిగిన తర్వాత డబ్బులు అడిగిన డ్రైవర్‌పై యువతి రాళ్లతో దాడికి దిగింది. అక్కడే ఉన్న కొందరు యువతి నిర్వాకాన్ని సెల్‌ఫోన్‌లో వీడియోతీశారు. వివరాల్లోకి వెళితే సదరు యువతి కరీంనగర్ నుంచి గోదావరిఖనికి ఆటో ఎంగేజ్ మాట్లాడుకోగా రూ.1200కు బేరం కుదుర్చుకుని అక్కడి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో డీజిల్ కోసం డబ్బులు అడగ్గా గోదావరిఖనికి వెళ్లిన తర్వాత డబ్బులు ఇస్తానంది. తీరా గోదావరిఖని చౌరస్తాకు చేరడంతో తనవద్ద డబ్బులు లేవని డ్రైవర్‌ను బెదిరిస్తూ దుర్భాషలాడింది. అంతేకాకుండా అక్కడున్న రాళ్లతో డ్రైవర్‌పై దాడికి పాల్పడింది. దీంతో అక్కడున్న ప్రజలంతా విస్తుపోయారు. చివరకు పోలీసుల జోక్యంతో ఆటోడ్రైవర్‌కు డబ్బులు ఇప్పించారు. మద్యంమత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు స్థానికులు పేర్కొన్నారు.